



శేషగిరి చీకటిలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. సిగరెట్టు పొగని గాలిలోకి ఊది "హా" అని లేచి గదిలో పచార్లు సాగించాడు. అతని ఆలోచన తెగటంలేదు. ఎంతసేపటికి ఒక నిర్ణయానికి రాలేక పోతున్నాడు. గుట్టగా క్రిందపడిన సిగరెట్టును చూసి తన మీద తనే జాలి పడ్డాడు. కిటికీలోంచి బయటకు చూశాడు. బయట కాదు చీకటి తన హృదయంలోని నిరాశా నిస్పృహలలాగ పరచుకొని ఉందను కొన్నాడు. ఎదురుగుండా అద్దంలోని తనరూపం తనని చూసి వికటంగా నవ్వింది. మాసిన గడ్డం, లోతుగా ఉన్న కళ్ళు, సంస్కారం లేని జుట్టు అద్దంలో చూసుకొనేటప్పటికి, శేష

దేవరకొండ సుబ్రహ్మణ్యం

గిరికి కమల మీద పట్టరాని కోపం వచ్చింది. "దీనికంతటికి కారణం ఆమే కదా! చిగురించి మొగ్గలు తొడుగు తున్న నా ఆశలను ఒక్క క్షణంలో త్రుంచేసి పోయిందికదా. ఆమె తనతప్పు తెలుసుకొనేలాగ ఎలాగైనా చేయాలి. ఈ శేషగిరి అల్లాటప్పా ప్రేమికుడు కాదని ఋజువు చెయ్యాలి"


నెమ్మదిగా, భారంగా అడుగులు వేసుకొని వెళ్ళి, అల్మారాలోంచి ఒక సీసాతీసి చూసుకొని, పల్చగా నవ్వు కొన్నాడు. "ఇంకా కొద్దిసేపటిలో ఈ శేషగిరి అనే వైద్య విద్యార్థి మజ్నూ దేవదాసుల కోవకు చెందిన ప్రగాఢ ప్రేమికుడు ప్రేమలో తిరస్కరింపబడి, ఆ బాధ సహించలేక, ప్రియురాలిని విడచి యీ లోకంలో ఉండలేక, ఈ లోకం విడచి అమర జీవి అవుతున్నాడు," అనుకొని బాధగా గుండెమీద చెయ్యి వేసికొని నిశీధిలోకి చూస్తూ గట్టిగా సిగరెట్టు దమ్ములాగి వదిలాడు. "రేపు పొద్దున్న నా మరణవార్త కాలేజిలో తెలుస్తుంది. ఆ వార్త విన్న తరువాత కమల, 'అయ్యో! శేషగిరి ప్రేమవిలువ తెలుసు కోలేక, అతనిని తిరస్కరించానే! నామూలాన్ని అతడు ప్రాణాలు కోల్పో యాడే' అని కంటికి మంటికి ఏక ధారగా ఏడుస్తుంది. నాకోసం పరి తపిస్తుంది......................"

శేషగిరి తృప్తిగా నిట్టూర్చి, టేబిల్ దగ్గరకు వెళ్ళాడు. ప్రక్కనే ఉన్న కూజాలోంచి ఒక గ్లాసెడు నీళ్ళు తీసు కొని త్రాగి, కుర్చీలో కూర్చుని, డ్రాయరులోంచి ఒక తెల్ల కాగితాన్ని కవరును బయటకు తీశాడు. పెన్నుని చేతిలోనికి తీసుకొన్నాడు. కాగితం మీద పెన్నువుంచే టప్పటికి చెయ్యివణికింది. చెమటలు పట్టాయి. "ఛీ! ఛీ! నాకు ఆత్మస్థైర్యం చాలటంలేదు. ఎలాగైనా ధైర్యాన్ని చిక్కబట్టుకోవాలి" అను కొన్నాడు శేషగిరి. నెమ్మదిగా లేచి వెళ్ళి, ఫ్లాస్కునందుకొని, వేడి వేడి కాఫీ గ్లాసులో పోసుకొని, నెమ్మదిగా 'సిప్' చేస్తూ తాగాడు. గోల్డుఫ్లేక్ సిగ రెట్టు ఒకటితీసి అంటించి గట్టిగా దమ్ములాగి పొగవదలి పెట్టాడు. "అయ్యో ఇక రేపటి నుంచి వుడ్ లాండ్ లో కాఫీ, ఈ గోల్డుఫ్లేక్ సిగ రెట్లు కాల్చడానికి ఉండదే" అని విచా రించాడు.

ప్రక్కనే మంచంమీద పడుకొని మత్తుగా, ఒళ్ళు తెలియకుండా నిద్ర పోతున్న ప్రసాద్ని చూసేటప్పటికి అసూయపుట్టింది. "ప్రాణస్నేహితుడు ఒకమూల ఇంత బాధతో క్రుంగి పోతుంటే, యింత ఆవేదనను అనుభ విస్తుంటే, వీడు ఎంత హాయిగా నిద్ర పోతున్నాడు" అనుకొని ప్రసాద్ వైపు కోపంగా చూశాడు. ఆ పళంగా పళ్ళు చితక్కొట్టి లేపాలనిపించింది.

ఛీ! వీడు తన బాధను అసలు అర్థం చేసుకోడే. ఒరేయ్ ఫూల్! 'కమల కాకపోతే యింకొక పిల్లమ్మా. ఇంత చిన్న విషయానికి ఎందుకురా అలాగ అరవ సినిమాలో హీరోలాగ బాధపడతావు' అని తన ప్రేమని అవ

హేళన చేశావు ఇడియట్! రేపు ప్రొద్దున నాలుగుగంటలకు "పిటి" వేయటానికి లేచినప్పుడు. శాశ్వత నిద్ర పోతున్న శేషగిరిని చూసి భోరున ఏడుస్తాడు. 'వాడు బ్రతికుండగా, వాడి హృదయంలోని బాధను తెలుసుకొని ఓదార్చలేక పోయానే' అని వాపోతాడు. కాని ఏంలాభం? పోయిన శేషగిరి తిరిగి రాడుగా తృప్తిగా సిగరెట్టు దమ్ము లాగి, మళ్ళీ టేబుల్ దగ్గరకు వెళ్ళాడు.



కుర్చీలో కూర్చుని, కొద్దిగా వణకుతున్న చేతులతో. చిరు చెమటలు కారుతుంటే వ్రాయడం ప్రారంభించాడు.

"ఒరేయ్ ప్రసాద్!

నేను ప్రాణంకన్నా సిగరెట్లకన్నా, కాఫీకన్నా అధికంగా ప్రేమించిన కమల నన్ను దయలేనిదై, కఠిన పాషాణ హృదయయై తిరస్కరించి, నా మనస్సులో అంతులేని క్షోభను రేకెత్తించిన సంగతి నీకు తెలుసున్నదే కదా! ఆమె తిరస్కారాన్ని భరించలేక, ఆమె తోడులేనిదే యీ ప్రపంచంలో బతుకలేక, నా ప్రేమను శాశ్వతం చేసుకోడానికి నేను యీ లోకంనుంచి శలవు తీసుకొంటున్నాను. నా ఆత్మహత్యను నువ్వు అంగీకరించవని చెప్పలేను.

ఒరేయ్ ప్రసాద్! ఎప్పుడైనా నీయీ స్నేహితుడు శేషగిరి జ్ఞాపకం వస్తే ఒక్క కన్నీటి చుక్కను రాలుస్తావు కదూ!

నా మరణవార్త నువ్వే స్వయంగా కమలకు చెప్పాలిరా. ఆమెను నువ్వే ఓదార్చాలి. ఆమె అడిగితే నేను సూట్‌తో తీయించుకొన్న కాబినెట్ సైజు ఫొటో ఒకటి ఆమె కియ్యి. నాయీ ఆఖరి కోరిక మన్నిస్తావుకదూ!

నేను కిళ్ళీ కొట్టు, హోటలులోను పెట్టిన ఖాతా బాకీలు నా పర్సులోని డబ్బుతో చెల్లించెయ్యి. నా పొర్మ కాలేజీ పుస్తకాలు అవీ నువ్వు తీసేసుకో.

జీవితంలో ఆడదాని వేట మోజు పోకుండా నువ్వయినా బాగుపడు. ఇంక శలవు తీసుకొంటాను!"

నీ ప్రాణస్నేహితుడు.
ప్రేమజీవి
కె. శేషగిరి."

ఉత్తరం ముగించి, రెండు మూడు సార్లు చదువుకొని. బాధగా కుర్చీలోకి వాలాడు శేషగిరి. బల్లమీద చేతులు

అవ్వి. తలను వాటిపై పెట్టి కాసేపు ఆలోచించాడు. ధైర్యం కాళ్ళక్రింద నుంచి కొద్దిగా సడలిపోయింది. ఇలా గైతే తను ఓడినట్లవుతాడు. ఎలాగైనా తన నిర్ణయాన్ని అమలు జరపాలని గట్టిగా నిశ్చయించుకొని. పిడికిలి బిగించి లేచాడు. కప్పులో కాఫీ కొద్దిగా 'సిప్' చేశాడు. సిగరెట్టు వెలిగించాడు.

వణుకుతున్న కాళ్ళతో నెమ్మదిగా అల్మారా సమీపించాడు. తలుపు తీయగానే కనిపించిన చెక్కపెట్టె చూసే టప్పటికి అతని ధైర్యం అమాంతంగా దిగజారిపోయింది "ఛీ! ఈ పాడు పని ఎందుకు? హాయిగా బ్రతుకు" అని ఒకవైపునుంచి మనస్సు బోధించింది. "ఇంత అవమానం పొందాక ఇంకా బ్రతుకుతావా? రేపొద్దున కమలకు, కమలలాంటి అనేక పాషాణ హృదయ నారీమణులకు నువ్వు గుణపాఠం నేర్పాలంటే ఈ ఆత్మహత్య చేసుకుతీరవలసిందే ఛీ! నువ్వు ప్రాణాలకోసం బేలవయ్యే పిరికివాడిగా ప్రవర్తిస్తావా?" అంటూ యింకొక వైపునుంచి గట్టిగా జగయ్య టోన్‌లో ఆత్మ ప్రబోధించింది. ఈ రెండు సలహాలను కాసేపు తక్కెడలో తూచి, మళ్ళీ ధైర్యం తెచ్చుకొని, చెక్కపెట్టెను వణుకుతున్న చేతులతో తెరచాడు లోపల చిన్న సీసాను చూడగానే వళ్ళు జలదరించింది. గొంతు గుండెలో కొట్టుమిట్టాడింది.

"ఈ స్లీపింగ్ పిల్స్ తను ఎవరికీ అనుమానం రాకుండా అతి జాగ్రత్తగా



సంపాదించాడు. ఇవి ఒక నిర్భాగ్య ప్రేమైక జీవి, భగ్నప్రేమిక నివేపు శాశ్వతంగా విద్యార్థుల చరిత్రలో నిలవడానికి ఉపయోగిస్తున్నాయి" అనుకొని శేషగిరి ధైర్యం కూడగట్టుకొన్నాడు. ఆలస్యం చేస్తే మనసు మారుతుందేమోనని, వెంటనే ఆ పిల్సు నోట్లో వేసికొని మ్రింగేశాడు.

శేషగిరికి శరీరం తేలిపోతున్నట్లనిపించింది. శక్తులన్నీ ఉడిగిపోయాయి.

కాళ్లు చేతులు తెగలాగసాగాయి. బుర్ర తిరగడం మొదలెట్టింది. ప్రపంచమంతా మసక మసకగా కనిపించసాగింది. నాలుక పిడచకట్టుకుపోయింది మంచి నీళ్ళకోసం ముందుకు వెళ్ళబోయాడు గాని, కాళ్లు కదలలేదు. పట్టుతప్పి తూలుతూ, పక్కనే ఉన్న మంచం మీద భారంగా వ్రాలాడు. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉన్నట్టు ఫీలయ్యాడు. దూరంగా యమదూతలు వస్తున్నట్టు కనిపించింది. అదుగో! తన చుట్టూ పాశం వేస్తున్నారు. అరే! తన నిలా ఎక్కడికి తీసుకుపోతున్నారు? మధ్యలో చిన్న కాలి బాట. చుట్టూ అగాధాలు. దారినిండా ముళ్ళు. తెలుగు సినిమాలోని యమలోకం సెట్టింగు లాంటి సీను కనిపించింది. చుట్టూ దుర్గంధం. పాపుల హాహాకారాలు. తనని నిప్పులో తోసేస్తున్నారు. "బాబోయ్!" అని అరిచాడు.

"ఏమిటిరా నీ కలవరింతలు? గొడవ చెయ్యకుండా పడుకో వెధవా!" అంటూ ప్రసాదు ఒత్తిగిలి పడుకున్నాడు.

"అయితే ఇదంతా నా ఊహే నన్నమాట" అనుకొన్నాడు శేషగిరి. "ఇప్పుడు కాకపోయినా, ఇంకాసేపటిలో చావడం ఖాయం. మాత్రలు పని చేయడం ఆరంభించినట్లున్నాయి. కను

నవ్వులాట—

★ "నేను ముసలిదాన్ని అయినా, ఇంతగానూ ప్రేమిస్తారా?" అని భార్య అడిగింది గోముగా.

"ప్రేమించడమా? పూజిస్తాను. నీ పాదాలు నడిచిన ప్రతిచోటా పువ్వులు పరుస్తాను. నీ కోసం ఏమైనా చేస్తాను.... అన్నట్టు నువ్వు మీ అమ్మ లాగ తయారు కావుగదా?"

మేష్టారు తీసివేతలు నేర్పుతూ "ఒరే సోమూ! నీ దగ్గర ఆరు పళ్ళున్నాయనుకో. నేను మూడు అడిగాననుకో. నీ దగ్గిర ఎన్ని మిగులుతాయి?"

తడుముకోకుండా సోము చెప్పాడు: "ఆరు పళ్ళండి."

—గుడిపాటి లక్ష్మీనరసింహం.

రెప్పలు మత్తుతో వాలిపోతున్నాయి" శేషగిరిని మళ్ళీ భయం ఆవరించింది.

"మా అమ్మా, నాన్నా, చెల్లాయి ఎంతగా ఏడుస్తారో నేను చచ్చిపోతే. అయినా, చచ్చి సాధించేదేముంది? కమల గుండె నాలాంటివాళ్ళ ఎంత మంది చావులు చూసి రాయి అయిపోయిందో. అయినా 'అఫ్టరాల్' ఒక్క అమ్మాయికోసం, ఇంత పర్సనాలిటీ, తెలివితేటలు, డబ్బు ఉండగా నేను చచ్చిపోవడమా! వీల్లేదు, నేను బ్రతకాలి! బ్రతికితీరాలి!" అనుకొన్నాడు.

లేచి తడబడుతున్న అడుగులతో ప్రసాద్ మంచం దగ్గరకు వెళ్ళి "ఒరేయ్! లేవరా. త్వరగా లేవరా. నేను చచ్చిపోతున్నానురా" అని గట్టిగా కుదపసాగాడు.

"మవ్వా! చస్తున్నావా? చచ్చిపో. ఆ మాత్రానికి నా నిదర పాడుచెయ్యడమెందుకురా గాడిదా! నన్ను పడుకోనీ" అని గాఢంగా గురకపెట్టసాగాడు ప్రసాద్.

శేషగిరికి తాడెత్తున కోపమొచ్చింది. ఒకప్రక్క ప్రాణస్నేహితుని ప్రాణాలు పోతుంటే, చీమకుట్టనట్టు పడుకొంటాడా? దొంగ రాస్కెల్. వీడు స్లీపింగ్ పిల్స్ తిని చావ!" అనుకొని పళ్ళు కొరికాడు శేష.

వీపు మీద నాలుగు చరిచి లేపి "ఒరేయ్! నేను నిజంగా చచ్చిపోతున్నానురా. ఒట్టురా. లేవరా! ఎలాగైనా నేను బ్రతికే మార్గం చూడరా!" అని బ్రతిమిలాడాడు.

"కమ్మటి నిద్ర మట్టిపాలు జేశావు గదరా శనీ! ఇంతకి ఏం మింగావురా? చెవికోసిన మేకలాగ అరుస్తున్నావు. తొందరగా తగలడు" అన్నాడు ప్రసాద్ విసుగ్గా.

"స్లీపింగ్ పిల్సురా! ఒకటి కాదు, రెండు కాదు. ఏకంగా పదిరా! నన్ను వెంటనే హాస్పిటల్‌లో జేర్పించు. ప్లీజ్" ప్రాధేయపడ్డాడు శేష.

"పదింటికే ఇంక యిప్పుడు నిన్ను హాస్పిటల్‌కు తీసుకువెళ్ళినా లాభం లేదు. ఆ మంచంమీద పడుకో హాయిగా "గయా" కొట్టేస్తావు. నువ్వేం భయపడకు. నిన్ను గంధం చెక్కలతో కాల్చే ఏర్పాటు చేస్తానులే."

"ఐతే నేను బ్రతకననంటావురా!"

"మళ్ళీ మళ్ళీ నన్ను అడగాలా! ఇష్టమై మాత్రలు మింగినవాడివి. మళ్ళా ఈ కాకిగోల ఎందుకు? హాయిగా చావు."

"బుద్ధి పొరపాటయి తిన్నానురా. ఒరేయ్! మా అమ్మా నాన్నలకు ఒక్కడే కొడుకునిరా! నేను పోతే వాళ్ళు బెంగతో కుమిలిపోతారు. వాళ్ళకోసమైనా నేను బ్రతకాలి. ఎలాగైనా నేను బ్రతికేమార్గం చూడరా!"

"ప్చ్! నిన్ను చూస్తే జాలేస్తుందిరా


శేషూ! కాని చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం. మీ పేరెంట్సుని నేను ఓదారుస్తాలే. మళ్ళీ వచ్చే జన్మలో కలుసుకొందాం బై. బై" అంటూ మళ్ళీ మంచంమీద జేరి ముసుగు పెట్టాడు ప్రసాద్.

శేషగిరి ఒక్కసారి బావురుమన్నాడు. కళ్ళలోంచి నీరు ఏకధాటిగా ప్రవహించ సాగింది. "ఒరేయ్! నామీద కనికరం చూపరా! నా యీ చివరి గడియల్లోనైనా నాకు తోడుగా ఉండరా! నీ స్నేహితుడు చచ్చిపోతుంటే జాలిలేకుండా అలా పడుకుంటావురా? ఒరేయ్ శేషూ" అని గద్గద స్వరంతో బ్రతిమాలసాగాడు శేషగిరి. ఎక్కిళ్ళతో యింకా అతని కంఠం కూరుకు పోయింది. నిరాశతో అక్కడ చతికిలబడి పోయాడు.

ప్రసాద్ లేచివచ్చి శేషగిరి భుజం మీద చెయ్యివేసి "ఒరేయ్! భయపడకురా, నువ్వు తిన్నవి స్లీపింగ్ పిల్సు కాదు. శాకరిన్ టాబ్లెట్సురా!" అన్నాడు.

శేషగిరి ఒక్క ఉదుటున లేచి మంచుని "నిజంగా" అంటూ సంభ్రమాశ్చర్యాలతో అడిగాడు.

"నిజంగారా! ఈ మధ్య కమల చేత తిరస్కరింప బడ్డాక నీ వెర్రి ప్రవర్తన కనిపెడుతూనే ఉన్నాను. ఏదో అఘాయిత్యం చేసేలాగ కనిపించావు.



అందుకని నీపై నిఘా వేసి ఉంచాను. నిన్న ప్రొద్దున నువ్వు ఏదో సీసా, భయం భయంగా ఆ పెట్టెలో పెట్టడం బయట నుంచి చూశాను. నువ్వు బయటకు వెళ్ళాక, ఆ సీసాలోని నిద్ర మాత్రలు తీసి బయట పడవేసి, మందుల షాపుకు వెళ్ళి, 'శాకరిన్ మాత్రలు' తెచ్చి దాంట్లో వేశాను. అందుకని యిప్పుడు నీ ప్రాణానికేమీ హానిలేదు. ఇక ముందెప్పుడూ ఇటువంటి పిచ్చిపనులు చెయ్యకు!" అన్నాడు ప్రసాద్.

"ఒరేయ్ ప్రసాద్! నిజంగా దేవుడివిరా" అని ఎగిరి గంతేసి కౌగలించుకొన్నాడు ప్రసాద్‌ని శేషగిరి.

ఖాళీ సీసా ఫక్కున నవ్వింది!

* * *